క్లుప్తంగా

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

తుని: రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో విక్రయించిన డీలర్ మంగపై కేసు నమోదు చేసినట్టు ఎంఎస్‌వో కిరణ్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో పాటు పలువురు కౌన్సిలర్లు పట్టణంలోని రేషన్ దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలను సమావేశం దృష్టికి తీసుకువచారు. దీంతో సివిల్ సరఫరా శాఖ అధికారుల ఆదేశాల మేరకు ఎంఎస్‌వో 41వ నంబర్ రేషన్ దుకాణంలో రికార్డులను పరిశీలించారు. స్టాకు రిజిస్ట్రార్‌లో 90 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్టు నిల్వ చూపించారని, వాస్తవాలనికి ఒక క్వింటా బియ్యం లేవన్నారు. 375 పంచధార ప్యాకెట్లు ఉన్నట్టు రిజిష్టర్‌లో ఉందని, వాస్తవానికి 253 ఉన్నాయన్నారు. దీంతో సదరు రేషన్ డీలర్ మంగపై 6 ఏ కేసు నమోదు చేశారు.

8న మెగా వైద్య శిబిరం

గోకవరం: గ్రామంలో ఈ నెల 8న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని ఎస్వీఆర్ ఫంక్షన్ హాలులో శ్రీశాంతి ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అడ్వొకేట్ శివ

ప్రత్తిపాడు: వృద్ధుల యోగ క్షేమాలను చూడాల్సిన బాధ్యత వారి సంతానంపై ఉందని ప్రత్తిపాడు కోర్టు ప్యానల్ అడ్వొకేట్ బుగత శివ అన్నారు. స్థానిక జాతీయ రహదారిపై గల శ్రీశారదా వయోవృద్ధ నిలయం ఆవరణలో ఆదివారం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధుల కోసం ప్రభుత్వం సీనియర్ సిటిజన్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. వృద్ధులైన తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారి పిల్లలపై తగు చర్యలు తీసుకోవచ్చన్నారు. అనంతరం వృద్ధులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు బొంగుకూరు మధుబాబు, ఏకేఎస్ మల్లేశ్వరరావు, ఎస్ దేవి, బెహరా లక్ష్మీప్రసన్న, వయోవృద్ధ నిలయం చైర్మన్ యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



జగ్గంపేటలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేసిన పెన్షనర్ల సంఘం నేతలు

జగ్గంపేట: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని జగ్గంపేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో 30 మంది పేద వృద్ధులను సత్కరించారు. వారికి భోజనం పెట్టి దుప్పట్లు, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోన బాబూరావు, పెన్షనర్ల సంఘం నేతలు మంచాల మల్లేశ్వరరావు, డి.అమృతరావు, కోశాధికారి కె.కృష్ణబాబు, మామిడి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు



నిందితులు, స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సిబ్బంది

గండేపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం పెద్దాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. మండలంలోని తాళ్లూరు శివారు సామిల్లుకు సమీపంలో పాన్ షాపు, జగ్గంపేట పద్మనాభ నగర్‌లో బెల్ట్ షాపు, బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలోని షాన్ పాపుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌చార్జ్ సీఐ కేవీ స్వామి తన సిబ్బందితో దాడి చేశారు. తాళ్లూరులో 8 బీరు బాటిళ్ల, 5 మద్యం సీసాలు, జగ్గంపేట పద్మనాభ నగర్‌లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించినా, సారా తయారీ, రవాణా, అమ్మకాలు జరిపినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్వామి హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్సై వై.నాగేంద్ర కృష్ణ, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.



తూర్పులక్ష్మీపురంలో శ్రమదానం చేస్తున్న ప్రజాప్రతినిధులు



ప్రత్తిపాడులో క్లాప్ మిత్రాలను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



తుని ఎంపీడీవో కార్యాలయాన్ని శుభ్రం చేస్తున్న ప్రజాప్రతిధులు



తుని అర్బన్ హెల్త్ సెంటర్లో మానవహారంగా ఏర్పడిన అధికారులు

శుభ్రత.. ఆరోగ్య భద్రత

- గ్రామాల్లో జోరుగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు
- చీపురు పట్టి రోడ్లు ఊడ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- పల్లెల్లో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు



బొద్దవరంలో రోడ్డు ఊడ్చుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



హైవేపై కృష్ణవరం టోల్‌గేట్ వద్ద స్వచ్ఛతా హి సేవా నిర్వహిస్తున్న సిబ్బంది

తుని: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని తుని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి కె.బాలకోటేశ్వరరావు అన్నారు. దివాణం వీధిలోని జూనియర్ సివిల్ కోర్టులో ఆదివారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పగ్రడ చక్రరావు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి బాల కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, రోడ్లపై వ్యర్థాలు వేయవద్దని సూచించారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పలువురు న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు కోరారు. స్థానిక 6వ వార్డు అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలో ఆదివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మానవహారంగా ఏర్పడి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల సహకారంతో వ్యర్థ రహిత పట్టణంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని ప్రజా ఆరోగ్యశాఖ అధికారి శేఖర్, కౌన్సిలర్ సుభద్ర దేవి తెలిపారు. శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఆదివారం జగ్గంపేటలో స్వచ్ఛతా హి సేవా అభియాన్ నిర్వహించారు. మండల సచివాలయాల కన్వీనర్, గ్రామ ఉప సర్పంచ్ బండారు రాజా ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు చీపుర్లు చేతబూని మెయిన్ రోడ్డు, సెంటర్లో బ్రిడ్జి కింద పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి స్థానిక బస్టాండ్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒమ్మి రఘురాం మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాధనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. జగ్గంపేట పంచాయతీలో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజా తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వసంతకుమార్, ఉప సర్పంచ్ బండారు రాజా, ఈఓపీఆర్డీ కొండలరావు, పంచాయతీ ఈఓ గణేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు చెరుకూరి జయరాజు, గొల్లపల్లి శ్రీను, ఆకుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

తుని రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మగాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణను ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోతల రమణ, ఎస్ఆర్ఈజీఎస్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది శుభ్రం చేశారు. వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ విద్యాలయం విద్యార్థినులు, ఉపాధ్యాయులు ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అనంతరం గ్రామంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గ్రామాల్లో ఏక్ తేదీ..ఏక్ ఘంటే

కోటనందూరు: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం చేపట్టిన 'ఏక్ తేదీ..ఏక్ ఘంటే' పారిశుధ్య కార్యక్రమం మండలంలో విజయవంతమైంది. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛందంగా పారిశుధ్య కార్యక్రమంలో పాల్గొని గ్రామాలను శుభ్రపరిచారు. బొద్దవరంలో సర్పంచ్ వేగి లక్ష్మి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు వేగి అప్పలనాయుడు, యల్లపు సత్యనారాయణ, దొడ్డి బాబ్జీ, ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్ తదితరులు గంటపాటు శ్రమదానం చేసి గ్రామాన్ని శుభ్రపరిచారు. టీజే నగరంలో సర్పంచ్ సుర్ల రాంబాబు, వ్యవసాయ సలహా మండలి మండలాధ్యక్షుడు సుర్ల రాజు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా ర్యాలీ నిర్వహించారు.

ఏలేశ్వరం: గాంధీ జయంతిని పురస్కరించుకుని గ్రామాల్లో ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రమదానం చేశారు. మండలంలోని జె.అన్నవరం, తూర్పులక్ష్మీపురం, లింగంపర్తి, యర్రవరం, సిరిపురం తదితర గ్రామాల్లోని అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది చీపుళ్లతో రోడ్లను శుభ్రం చేశారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కిర్లంపూడి: మండల వ్యాప్తంగా 19 గ్రామ పంచాయతీల్లోనూ ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణవరం టోల్‌గేట్ వద్ద టోల్ ప్లాజా మేనేజర్ ఖరిముల్లా, హెచ్ఓయూ అధికారి నాయుడు, స్థానిక ఎస్సై పి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న వ్యర్థాలను తొలగించారు. కిర్లంపూడి, వీరవరం, గెద్దనాపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బంది పరిసరాలను శుభ్రం చేశారు. జగపతినగరం గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో వీధులను శుభ్రం చేశారు.

ప్రత్తిపాడు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆదివారం క్లాప్ మిత్రాలతో అధికారులు, ప్రజాప్రతినిధులు కాఫీ తాగారు. అనంతరం క్లాప్ మిత్రాలను గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎన్నడూ లేని విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు తమతో కలిసి కాఫీ తాగడం, తమను సత్కరించడంపై క్లాప్ మిత్రాలు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, కార్యదర్శి ద్విభాష్యం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు గుడాల వెంకటరత్నం, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చీపురు పట్టిన సర్పంచ్

ప్రత్తిపాడు గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి చీపురు పట్టారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆమె క్లాప్ మిత్రాలతో పాటు చీపురు పట్టి చెత్తను ఊడ్చారు.

పరిశుభ్రతపై కేజీబీవీ విద్యార్థినుల ర్యాలీ

తొండంగి: కోదాడ పంచాయతీ వాకదారిపేటలో కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థినులు ఆదివారం స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ఘంటశాల రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థినులు అధ్యాపకులు, ఉపాధ్యాయులు కళాశాల ప్రాంగణంలో శ్రమదానం నిర్వహించారు. పాఠశాల ఆవరణను శుభ్రం చేసి పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం వారంతా బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు.



వాకదారిపేట కేజీబీవీలో శ్రమదానం చేస్తున్న విద్యార్థినులు

రంచన్‌గా పింఛన్



ఏలేశ్వరంలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతిక



వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న నగర పంచాయతీ ఇన్‌చార్జ్ కమిషనర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం సామాజిక పింఛన్ల పంపిణీ జోరుగా సాగింది. సెలవురోజున సైతం తెలవారుజామునే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్లు అందజేయడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1, 2 తేదీల్లో సెలవులు రావడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం ముందుగానే పింఛన్ సొమ్ము సచివాలయాలకు అందజేసింది. ఏలేశ్వరం మండలంలో తొలిరోజు 90 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 26 వేలకు పైగా వృద్ధాప్య, వితంతువు, వికలాంగ పింఛన్లు అందజేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికే వెళ్లి పింఛన్లు అందజేశారు.

'ఏలేటి' సేవలు మరువలేం

జగ్గంపేట: హిందూ ధర్మ పరిరక్షణకు విశ్వహిందూ పరిషత్ నాయకుడు ఏలేటి వీరభద్రరావు చేసిన సేవలు మరువలేమని పలువురు వక్తలు అన్నారు. ఏలేటి వీరభద్రరావు ఇటీవల మృతి చెందగా ఆదివారం జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో ఆయన సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హిందూ ధర్మం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఆయన కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బెంగళూరు ప్రాంత ప్రచారక్ భరత్ కుమార్, ఆర్ఎస్ఎస్ రాజమండ్రి విభాగ్ ప్రచారక్ ఓలేటి సత్యనారాయణ, విశ్వహిందూ పరిషత్ ప్రాంత కార్యదర్శి తనికెళ్ల సత్య రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తునిలో 50 ఏళ్ల తరువాత కలిసిన పూర్వ విద్యార్థులు

తుని: తమ ఉన్నతికి ఎంతగానో దోహదం చేసిన రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పూర్వ విద్యార్థులు అన్నారు. స్థానిక బెల్లపువీధిలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో ఆదివారం తుని రాజా ప్రభుత్వోన్నత పాఠశాలకు చెందిన 1971–76 బ్యాచ్, జూనియర్ కళాశాలకు చెందిన 1976–78 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దేశ, విదేశాల్లో వివిధ ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో స్థిరపడిన వీరంతా సుమారు 50 ఏళ్ల తరువాత కలుసుకుని అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకూ సందడిగా గడిపారు. తమ అభ్యున్నతికి పునాది వేసిన విద్యాసంస్థల అభివృద్ధికి తామంతా కట్టుబడి ఉన్నామని ప్రొఫెసర్ బూడిద వరహాల బాబు తెలిపారు. సైంటిస్ట్ శేషు, రాజకీయ నాయకుడు తోట నగేష్, బ్యాంకు మేనేజర్లు శ్రీరామచంద్ర మూర్తి, గ్రంధి గణేష్, విశ్రాంత ఉపాధ్యాయులు కె.నాగభూషణం, సుబ్బారావు, రమణమ్మ, దాసరి విశ్వేశ్వరరావు, చెక్క జగన్నాథం, కుసుమంచి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం

- మాజీ ఎంపీ తోట నరసింహం
- గండేపల్లిలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: పేద ప్రజలకు ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్య సేవలు అందుతున్నాయని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. గండేపల్లిలో తొండాపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ గుల్లా ఏడుకొండలు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ గఫూర్, పార్టీ నాయకులు తోట రాంజీ, కరుటూరి శ్రీనివాస్, అత్తులూరి సాయిబాబు, తులా రాము, కందిరెల్లి కామేష్, తోట అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తోట నరసింహం

బొజ్జ గణపయ్య.. వెళ్లి రావయ్యా..



ఏలేశ్వరంలో గణపతిని ఊరేగిస్తున్న యువత, భక్తులు



కత్తిపూడిలో ట్రాక్టర్‌పై వినాయకుని ఊరేగింపు

- ఘనంగా గణేశ్ నిమజ్జనాలు
- ఊరేగింపులో సందడి చేసిన యువత, మహిళలు

గోకవరం: వినాయక చవితి ఉత్సవాలు ముగియడంతో ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. గ్రామాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను తీన్‌మార్ డ్యాన్సులు, బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. గణపతి ఊరేగింపులో యువత, మహిళలు సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

ఏలేశ్వరం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగియడంతో ఏలేశ్వరం పట్టణం, గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు చోట్ల నెలకొల్పిన గణపతి విగ్రహాలను తీన్‌మార్, బ్యాండ్‌మేళాలు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి స్థానిక ఏలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఏలేశ్వరం లింగంపర్తి రోడ్డులో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని ఊరేగింపు వైభవంగా జరిగింది. ఊరేగింపులో మహిళలు, యువకులు సందడి చేశారు.

రౌతులపూడి: గణపతి నవరాత్రులు ముగియడంతో మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఆదివారం నిమజ్జనం చేశారు. బలరామపురం, గుమ్మరేగుల, రౌతులపూడి, ఎస్.అగ్రహారం తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణేశ్ విగ్రహాలను డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. బలరామపురం, గుమ్మరేగుల గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.

శంఖవరం: మండలంలో ఆదివారం గణపతి నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. కత్తిపూడి, జి.కొత్తపల్లి, అచ్చింపేట, గౌరంపేట తదితర గ్రామాల్లోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో గణపతిని ఊరేగించి నిమజ్జనాలు చేశారు. ఊరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

గండేపల్లి: మండలంలోని ఆదివారం గణపతి నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. నవరాత్రులు ముగియడంతో గండేపల్లి, మల్లేపల్లి, తాళ్లూరు, నీలాద్రిరావుపేట తదితర గ్రామాల్లోని గణపతి విగ్రహాలను బ్యాండ్ మేళాలు, తీన్‌మార్ డ్యాన్సులు, బాణసంచా కాల్పుల నడుమ ఊరేగించి చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వీఐపీ సత్రం..కనుమరుగు

- రత్నగిరిపై శ్రీసత్యదేవ గెస్ట్‌హౌస్ కూల్చివేత
- ఆ స్థలంలో విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించేందుకు సన్నాహాలు
- సత్రంలోని దుకాణాలు పశ్చిమ రాజగోపురం పక్కకు తరలింపు



సత్యదేవుని పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం (కూల్చివేతకు ముందు)



30 వీఐపీ సత్రం కూల్చివేసిన దృశ్యం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో 38 సంవత్సరాలుగా భక్తులకు సేవలందించిన పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల 30 వీఐపీ సత్రం (శ్రీసత్యదేవ గెస్ట్‌హౌస్) కనుమరుగైంది. ఈ సత్రం కూల్చివేత పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం సత్రం కూల్చివేయగా వచ్చిన వ్యర్థాలను తరలిస్తున్నారు. ఈ సత్రం స్థలంలో సికింద్రాబాద్‌కు చెందిన లారెల్స్ ఫార్మాస్యూటికల్ కంపెనీ రూ.1.99 కోట్లతో 180 అడుగుల పొడవు, 150 అడుగుల వెడల్పుతో విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించనుంది. సుమారు రెండు వేల మంది భక్తులు సేద తీరేలా ఈ షెడ్డు నిర్మించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.

1985లో నిర్మాణం

రత్నగిరిపై సత్యదేవుని దేవస్థానంలో ఆధునిక వసతులతో సత్రాలు లేని రోజుల్లో శ్రీసత్యదేవ గెస్ట్‌హౌస్ నిర్మాణానికి పూనుకున్నారు. 1985లో దేవస్థానానికి వచ్చే వీఐపీలకు వసతి కల్పించేందుకు 30 గదులతో ఈ సత్రం నిర్మాణం ప్రారంభించారు. 1987లో నిర్మాణం పూర్తి చేశారు. ఎక్కువగా వీఐపీలకు ఆ తరువాత భక్తులకు ఈ సత్రంలో గదులు అద్దెకు ఇచ్చేవారు. దీంతో 30 వీఐపీ సత్రంగా ఇది ప్రసిద్ధి చెందింది. ఈ సత్రం గదులకు డిమాండ్ పెరగడంతో 1988లో 30 గదులతో మొదటి అంతస్తు కూడా నిర్మించారు. అప్పటి నుంచి ఇందులో 60 గదులు భక్తులకు అందుబాటులోకి వచ్చాయి. 38 సంవత్సరాలు ఈ సత్రం భక్తులకు సేవలందించింది.

రెండు వేల మంది విశ్రాంతి తీసుకునేలా విశ్రాంతి షెడ్డు

సత్యదేవుని ఆలయానికి వచ్చే భక్తులు ఎక్కువగా పశ్చిమ రాజగోపురం ఎదురుగా గల వై జంక్షన్ నుంచి వస్తున్నారు. సుమారు 80 శాతం మంది భక్తులు ఈ మార్గం ద్వారానే వస్తున్నారని అంచనా. కార్తిక మాసం లాంటి పర్వదినాల్లో భక్తులతో పశ్చిమ రాజగోపురం వద్ద తీవ్ర రద్దీ ఏర్పడుతోంది. గతేడాది కార్తిక మాసంలో ఏకాదశి నాడు భక్తుల రద్దీ తట్టుకోలేక పశ్చిమ రాజగోపురం తలుపులు మూసి వేసి సుమారు గంట సేపు భక్తులను లోపలకి అనుమతించని విషయం తెలిసిందే. దీంతో భక్తులు పశ్చిమ రాజగోపురం నుంచి ఘాట్‌రోడ్ వరకూ నిలిచిపోయారు. ఈ ఏడాది నవంబర్ 13 నుంచి కార్తిక మాసం ప్రారంభం కానుంది. ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రామాలయం వద్ద నిర్మించినట్టుగా 30 వీఐపీ స్థలంలో విశాలమైన విశ్రాంతి షెడ్డు నిర్మించాలని నిర్ణయించారు. ఆ షెడ్డు పక్కనే మరుగుదొడ్లు నిర్మించేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించారు. దీని నిర్మాణం పూర్తయినే కార్తికమాసం వంటి పర్వదినాల్లో వసతి గదులు దొరకని భక్తులు ఈ షెడ్డులో విశ్రాంతి తీసుకుని స్వామివారి దర్శనానికి వెళ్లే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. నవంబర్ పదో తేదీ లోపు ఈ స్థలంలో విశ్రాంతి షెడ్డు నిర్మించాలని లారెల్స్ లాబ్ ప్రతినిధులను ఈఓ కోరారు.

తూర్పు రాజగోపురం ఉత్తరం వైపు షాపులు

30 వీఐపీ సత్రం ముందు గల పూజాద్రవ్యాల షాపు, పాన్ షాపు, కాఫీ, టీ స్టాల్, బుక్‌స్టాల్, ఇతర షాపులను పశ్చిమ గోపురానికి ఉత్తరం వైపున గల స్థలంలోకి మార్చారు.